అక్కలా
మారిన
ఆ అమ్మ నటనకి
కారణం!

# మరబ్బాయి

ఉరిటి సురేష్
కథ

అంత పొడుగూ, అంత పొట్టికాకుండా, అంత లావూ, మరీ అంత సన్నం కాకుండా, అంత తెలుపు, అలా అనినలుపు కాకుండా మధ్యస్థంగా వుండే అతడే మరబ్బాయి. అబ్బాయంటే అబ్బాయికాదు. నలభై ఏళ్ల నడివయస్కుడే! అయినా అతడ్ని అంతా అట్లనే పిలుస్తారు. ఒళ్లు మండితే మాత్రం 'మరమనిషి'అని లోలోపలే తిట్టుకుంటారు.

నాకూహ తెల్సినప్పటినుండీ నేనతడ్ని ఎరుగుదును. నే ఊపిరిపోస్కోక మునుపునుండి మాఊరు అతన్నెరుగును. చిన్ని లాగులు వేస్కునేప్పుడే పక్కూరి తిరునాళ్లలో తప్పిపోయి మా ఊరు చేరుకుని ఏడుస్తున్నాడంట.

అదిగో అప్పుడే మా ఊరి పిండిమిల్లాయన చేరదీసి ఇంతవాడ్ని చేశాడు. తర్వాత కొన్నేళ్లకి అతడు మరణించాకా ఆనాటినుండి ఈనాటివరకు ఆ పిండి మరే అతడి జీవనాధారం అయిపోయింది. ఆనాటినుండి అతన్నెరుగున్నవాళ్లవ్వడం మూలాన మా ఊరాళ్లంతా 'మరబ్బాయి'నే పిలుస్తారు.

ఈరోజే మా ఊరి జాతర. చుట్టుప్రక్కూర్లనుండి కూడా జనం వస్తున్నారు. అందరిళ్లూ చుట్టాలతో సందడిగా వున్నాయి. మా ఊళ్లో దాదాపు వెయ్యివరకు ఇళ్లుంటాయి. అందులో రెండు వీధులు మాత్రమే పెంకుటిళ్లు. మిగిలినవన్నీ గుడిసెలే!

ఊరి శివార్లలో అమ్మవారి గుడి. పండగపుణ్యమాని ఊరంతా కళకళలాడుతోంది. ఆడాళ్లంతా హడావుడిగా తిరుగుతున్నారు. మగాళ్లంతా పందిళ్లు వేయడంలోనూ, తిరు



నాళ్లకి దుకాణాల్ని అలంకరించడంలోనూ తీరిక లేకుండా తిరుగుతున్నారు. ముస్తాబవుతోన్న ఊరివంక, దూరంగా కన్పిస్తోన్న పిండిమరవంక చూస్తూ ఆలోచిస్తున్నా.

“ఒరేయ్, కుంటాడా తొందరగా తెమిలి పిండాడించుకుని రా'' వసారామండి పెద్దవదిన అరుస్తోంది.

“ఒరేయ్ భాస్కరం దాన్నోరపలే మంచి

దికాదు తొందరగా తెమిలి వెళ్లరా" నెమ్మదిగా చెప్పింది అమ్మ.

చంకలకింద కర్రల్ని పెట్టుకుని, ఓ చేత్తో సంచి పట్టుకున్నాను.

"మొత్తం ఆరు కిలోలు. అంతా పిండే. మెత్తగా ఆడమని చెప్పు. వాడితో నువ్వు కబుర్లేసుకుని కూచోకు. ఆడపడుచు అర్ధ మొగుడితో సమానం. అసలే అంత దూరం నుండి వస్తున్నారు. చాలాకాలాన్కి వస్తున్నారా? పిల్లలు వోరాడించటాన్కి లేకపోతే ఆవిడ నోరు పారేస్కుంటుంది" కూరలు తరుగుతూ రెండో వదిన అరుస్తోంది.

ఉదయం లేచిందగ్గర్నుంచీ కడుపులో ఏం పడలేదేమో నాకు నడవాలంటే నీరసంతో శోష వచ్చేలా వుంది. నెమ్మదిగా కదిలాను. సరిగ్గా సందు మలుపు తిరిగానో, లేదో వెనకనుండి అమ్మ వచ్చి బాగా చల్లార్చిన కాఫీ గ్లాసుడు నా నోటికందించి, జేబులో నాలుగు సున్నుండలు పెట్టింది. అప్రయత్నంగా నా కళ్లల్లో నీళ్లూరాయి. నాకావిడ సొంత అమ్మకాదు. ఆ విషయం మా వదినలు ఓసారి ఈసడింపుగా అన్నప్పుడు నాకు తెల్సింది.

◇ ◆ ◇

సిలవరి డబ్బాలు, స్టీలు క్యాన్లు, వరసగా పేర్చబడి చీమలబారులా వుంది. ఇంకా ఏం లేదన్నా ఓ గంట ఆగాల్సిందే. వచ్చినవాళ్లంతా డబ్బాలు అక్కడే పెట్టేసి మిగిలిన పన్లు చక్కబెట్టుకోటాన్కి వెళ్లిపోతున్నారు. మా ఊరంతటికీ అదొక్కటే పిండిమర. నాకు వేరే పనేంలేదు. ఉన్నా వెళ్లాలని లేదు. అందుకే అక్కడే వున్న కర్రబెంచీమీద కూచున్నా చేతికింది కర్రల్ని పక్కనపెట్టి.

నా అలికిడికి ఓసారి తలెత్తి మళ్లీ ఎప్పట్లా తన పనిలో నిమగ్నమయ్యాడు మరబ్బాయి. నన్నుచూసి పలకరింపుగా నవ్వినట్లుగా కూడా అన్పీలేదు. అతడెప్పుడూ అంతే.

అసలతడు నవ్వగా చూసినవాళ్లెవ్వరూ మా ఊళ్లో లేరు. అతడెప్పుడో కొన్నేళ్ల క్రింద, అతడికి పెళ్లవక మునుపు పక్కూరి ఆస్పత్రిలో నవ్వీ నవ్వనట్టు నవ్వాట్ట! ఆ విషయం తల్చుకుంటూ మా అమ్మ అప్పుడప్పుడు గుంభనంగా నవ్వుతుంది.

"అవి రెండు కిలోలే మా అమ్మ చెప్పింది" నిర్లక్ష్యంగా ఓణీ సర్దుకుంటూ అంటోంది ఓ అమ్మాయి.

"రెండున్నర కిలోలకి డబ్బులుపెట్టి డబ్బా తీస్కో. లేకపోతే మీ అమ్మనే రమ్మననే చెప్తా" కోపంగా చెప్పి మరమండి పిండి జారుతోన్న గుడ్డసంచిని దులిపాడు.

"ఇంతోటి పిండికి మా అమ్మెందుకు? ఊ తీస్కో" అంటూ విసురుగా రెండ్రూపాయలు తీసి ఇచ్చింది. మిగిలిన చిల్లర ఆమెకిచ్చేసి మళ్లీ తన పనిలో నిమగ్నమయ్యాడు. నిండిన డబ్బాలు, నేను తప్ప అక్కడెవరూ లేరు.

అప్పటికి నేనొచ్చి పావుగంట. జేబులో వున్న సున్నుండలు తగిలాయి. తీసి తినబోయాను. అంతలోనే మరబ్బాయి గుర్తొచ్చాడు. అటు చూశాను. అతను నన్ను పట్టించుకోవడంలేదు. యంత్రంలా అతను పనిచేస్కుపోతున్నాడు. అందుకేనేమో అతడ్ని అంతా మరమనిషి అంటారు. అతడు మరకి వచ్చినప్పటినుండి వెళ్లేదాకా నుంచునే వుంటాడు. అన్నిరకాల పిండివాసన్లూ కలిసి అక్కడి గాలి గమ్మత్తుగా

సోకుతోంది. మర చేస్తోన్నరొద నాకెందుకో సంగీతంలా తోస్తోంది. ఒళ్లంతా అంటుకున్న పిండి మధ్య అతడు తెల్ల బూచాడిలా అన్పించాడు.

“మరబ్బాయి ఇదిగో తీస్కో” అంటూ రెండు సున్నుండల్ని అతడికి అందించాను. నా రేగిన జుట్టువంక, అలసిన కళ్లవంక ఓసారి తేరిపారచూసి ఒకటి తీస్కున్నాడు మౌనంగా. అది కృతజ్ఞతా? ఏమో?

నాకెందుకో అతనంటే ఇష్టం. అసలు నేనిష్టపడేవాళ్లలో నన్నిష్టపడేవాళ్లల్లో అతడూ ఒకడని నా నమ్మకంవల్ల కాబోలు! లేకపోతే నన్ను ‘కుంటోడా’ అంటూ పిలవని వాళ్లలో ఒకడవ్వడంవల్ల నయినా కావచ్చు.

నేనేం ఇచ్చినా ఏం అనకుండా తీసుకుంటాడతను. అతనితో ఆ మాత్రమన్నా సంబంధం పెట్టుకున్నది నేను మాత్రమే!

“మరబ్బాయి నీకు పిల్లల్లేరా?” నావంక ఓసారి సూటిగా చూసి తల తిప్పేస్కుని చెప్పాడు “ఉన్నారు”

“మరి నీ భార్య?” అడిగా సున్నుండ కొరుకుతూ.

“లేచిపోయింది” చేతులు దులిపేస్కుని మరచక్రాన్ని తిప్పాడు తీవ్రంగా.

“అతడు మరమనిషి కాబట్టే పెళ్లాం ఎవడితోనో లేచిపోయింది”

ఊరివాళ్ల మాటలు గుర్తొచ్చి నేనింకేం మాట్లాడలేదు.

◇ ◆ ◇

సాయంత్రమయ్యింది.

ఏటిగాలి చల్లగా తాకుతోంది. బంతిపూల కుప్పలు బంగారుపోగుల్లా మెరుస్తున్నాయి. వెండి మెరుపులుచుట్టిన గులాబీలు పగడాల దొంతర్లలా తళుక్కుమంటున్నాయి. వేగిన వేడి బఠాణీలు, దంపుడు అటుకులు, తెల్ల శెనగపప్పు కొంచెం తెర్చిన గోనెసంచుల్నుండి నోరూరిస్తున్నాయి. నాకు చాలా సంతోషంగా వుంది. దానికి కారణం లేకపోలేదు.

అస్సాం తేయాకుతోటల్నుండి మా అక్క, పిల్లల్తో వచ్చింది. పదహారేళ్ల తర్వాత

## ఆకలే ఆకలి!!



*ఈ మధ్యన చైనాలోని ‘టాంగ్‌షా’లో ఓ స్త్రీ ప్రసవ సమయంలో విపరీతంగా బాధపడడంతో డాక్టర్లు ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీసి ఆశ్చర్యపోయారట! దానికి కారణం ఆ పసికందు ఎనిమిది కిలోగ్రాముల బరువుండడమే! అంతేకాదు — ఐదుసంవత్సరాల పాపకుండే ఆకలి ఆ పసికందుకు ఉండడం మరో ప్రత్యేకత! పాపం... ఆ బిడ్డకు ఫీడ్ చేయలేక సంవత్సరాల వయసుగల ఆ తల్లి నానా తంటాలూ పడుతోందట!*

— జూపిటర్

మళ్లీ మా అక్క ఇదేరావడం. మా అక్క నిజాన్కి సొంత అక్క కాదు. అయినా ఎందుకో ఆవిడకి నేనంటే ప్రేమ! అక్కడ్నుండి ఎవరొచ్చినా నాకు బట్టలు పంపుతుంది. తినుబండారాలు పంపుతుంది. మా బావ టీ తోటలో లేబర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి మా అక్కతో పెళ్లికుదిరాకే అక్కడ పనిదొరికింది. అందుకే మా అక్కంటే అతడికి విపరీతమైన ప్రేమ. కానీ పెళ్లయిన ఏడాదివరకు ఆవిడని అక్కడికి తీస్కెళ్లడానికి కుదర్లేదు.

వెళ్లిన తర్వాత మళ్లీ ఆవిడ ఇప్పుడే పుట్టింటికి రావడం. నిజానికి ఆవిడని ఇదే మొదటిసారి నే చూట్టం.

ఆవిడ భర్త దగ్గరికి వెళ్లిపోయాకే నేను అమ్మకి దొరికానంట!

అక్క, నేను, పిల్లలు సరదాగా తిరుగుతున్నాము. అక్క పిల్లలుకూడా దాదాపు నా ఈడువాళ్లే.

పన్నెండు నిండి పధ్నాలుగేళ్ల మధ్య పెద్దాడు నాకన్నా ఏడాది చిన్న. నాతో మాట్లాడుతోన్న అక్క కళ్లు ఒక్కసారి తళుక్కున వెలిగాయి. ఎందుకో నాకర్థంకాలా. వెనక్కి తిరిగి చూశా. చుట్టుపక్కల అంతా చూశా. అక్కడెవరూ లేరు. తర్వాత అక్క ముభావంగా మారిపోయింది.

మమ్మల్నొదిలేసి అర్థాంతరంగా అక్క ఇంటికెళ్లిపోయింది. ఓ అరగంట తర్వాత మేమూ ఆమెననుసరించాం. నాకెందుకో మనస్సు చివుక్కుమంది. అక్క విచారానికి కారణం తెలీలేదు.

ఆ రాత్రి అక్క మనసుమల్లే లోకం అంతా గుబులుగా వుంది. జాతరలో అలసిపోయేరేమో ఇంట్లో అంతా హాయిగా నిదరోతున్నారు. నిద్రపోనిదల్లా నేను. ఆఖరి పక్కమీద నిద్రనటిస్తోన్న అక్క.

అర్ధరాత్రి దాటిందనుకుంటా, నెమ్మదిగా లేచింది అక్క. అటుఇటు చూసింది. ఆమెకు అనుమానం రాకుండా నే కళ్లు గట్టిగా మూస్కున్నా. తలమీదనుండి కొంగు కప్పుకుంటూ చీకట్లో వడివడిగా నడవసాగింది. ఆమె వెళ్లిన రెణ్ణిమిషాలకి నా చేతికర్రలు సర్దుకుంటూ నేనూ అనుసరించాను.

రెల్లుగడ్డిని దాటుకుంటూ, వల్లేరు పొదల పక్కనుండి వెనక్కి చూడకుండా నడుస్తోంది. అక్క అలా ఎంతసేపునడిచిందో. నే అలసిపోయాను. సరిగ్గా అప్పుడే అమ్మవారి గుడిపక్కనున్న మొండిగోడల ఇంటిలోకి వెళ్లింది.

నే భయపడ్తూనే గోడపక్కన నిల్చున్నా. తొంగిచూశా. అక్క, ఓ మోస్తరులావుతో, ఓ మోస్తరు ఎత్తుతో పసుప్పచ్చని రంగులో, వెన్నెట్లో మెరుస్తోన్న గుమ్మడి పువ్వులా వుంది. ఆమె కళ్లు నక్షత్రాల్లా వెలిగిపోతున్నాయి.

ఆ చీకట్లో ఒకలాంటి ఆకర్షణతో అతడు నవ్వీ నవ్వనట్టు నవ్వుతున్నాడు. అతను నవ్వాడు! మళ్లీ చాన్నాళ్లకి.

"అమ్మా, మరబ్బాయి నవ్వని నేనూ చూశా" సంతోషంతో గట్టిగా అరవాలనుకున్నా. అలవాటైన నా అలికిడికి అతడు కళ్లుతిప్పాడు. నేను పట్టుబడ్డా. దోషిలా అక్కముందు నించున్నా.

మరబ్బాయి కళ్లల్లో ఏదో దిగులును కప్పుకున్న ఆనందం! అతడు 'మరమనిషి'

కాదు. అతడికీ మనసుంది. మొదటిసారిగా నాకట్లా అన్పించింది.

"అమ్మా గుండెనొప్పి" అక్క చెయ్యి గట్టిగా పట్టుకుంటూ బాధగా అరిచాడు మరబ్బాయి. అక్క కంగారుగా అతన్ని తన వళ్లో పడుకోబెట్టుకుంది.

"అక్కా, మరబ్బాయికేమయింది?" ఆందోళనతో అన్నా.

"ఆ... య... వ... మరబ్బాయి కాదు. భాస్కరం, ఆయనే నీ తండ్రి" నా తలమీద చెయ్యివేస్తూ దుఃఖంతో జీరబోయిన గొంతుతో అంది అక్క. అతడు నవ్వీ నవ్వనట్టు నవ్వాడు. అచ్చం పెళ్లికి మునుపు పక్కూరి ఆస్పత్రిలో నవ్వినట్టే!

"అక్కా!" అప్రయత్నంగా నా గొంతు పూడుకుపోయింది.

"అ... క్క... కాదు.... అమ్మ... అ..వును. నేనే నీ అమ్మని. నీ పిరికి తల్లిని"

అ...క్క! కాదు అమ్మ! భోరున ఏడుస్తోంది. మరణించిన 'మరబ్బాయి(?) మీదపడి! ఆ దృశ్యానికి కదిలిపోయిందేమో ఆకాశం కూడా ఏడుస్తూ కన్నీటివి కారుస్తోంది.

ఆ మర్నాడు పిండిమర పక్కనున్న గుడ్డ సంచిలో పదివేల రూపాయలు, దానిమీద 'భాస్కరం క్రకాలికోసం' అని రాసున్న కాయితం చూపి "కుంటోడు అప్పుడూ... అప్పుడూ ఇచ్చిన తినుబండారాలకే ఆ మరమనిషి ఇంత డబ్బిచ్చాడు!" జనం గుసగుసలు నన్ను దాటిపోలేదు!

ఇంతకీ ఎవరు 'మరమనుషులు!'

★

